# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th - HAPPY - ANNIVERSARY

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 304 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 16 జూలై 2024 వెల : 5/-రూ॥

VOLUME :10 ISSUE : 304 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 16 JULY 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# బ్రహ్మంగారు కాలజ్ఞానం రాసిన ప్రాంతాన్ని కూడా వదల్లేదు

## సహజ వనరుల దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు

### వైసీపీ పాలనలో ఖనిజ సంపద దోపిడీకి గురైందని వెల్లడి

### మైనింగ్, క్వారీ లీజుల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణ

### ఇసుక విధానంలో తప్పుడు పద్ధతులు అవలంబించారని విమర్శలు

### మడ అడవులను కూడా ధ్వంసం చేశారని ఆగ్రహం

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ సహజ వనరుల దోపిడీ అంశంపై శ్వేతపత్రం విడుదల చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో ఖనిజ సంపద దోపిడీకి గురైందని వెల్లడించారు. మైనింగ్, క్వారీ లీజుల్లో అనేక అక్రమాలకు పాల్పడ్డారని వివరించారు. కర్నూలు జిల్లాలో రవ్వలకొండ ఉంది... బ్రహ్మంగారు కాలజ్ఞానం రాసిన ప్రాంతం... దాన్ని కూడా కొట్టేశారు... ఒక చారిత్రక ప్రదేశం... దీని జోలికి వెళ్లకూడదు అనే విచక్షణ కూడా లేకుండా దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు.

ఇసుక అంశంలో తప్పుడు విధానం తెచ్చి, ఇష్టానుసారం దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. అక్రమ ఇసుక తవ్వకాల ద్వారా ప్రభుత్వానికి రూ.7 వేల కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. ఖనిజాల తవ్వకాల్లోనూ ప్రభుత్వానికి రూ.1000 కోట్లకు పైగా నష్టం జరిగిందని అన్నారు. అదే సమయంలో ప్రత్యర్థులు మైనింగ్ ను ఆపివేయించడం, జరిమానాలు వేయించడం వంటి చర్యలకు పాల్పడ్డారని, అటవీభూముల్లో లీజు లేకుండానే మైనింగ్ కు చేశారని ఆరోపించారు. గనుల కేటాయింపులో మొదట వచ్చిన వారికి మొదట నిబంధనలకు తూట్లు పొడిచారని, పర్యావరణ నిబంధనలు పాటించకుండా మైనింగ్ చేపట్టారని విమర్శించారు. ఓ పద్ధతి లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టి, పర్యావరణానికి




హాని కలిగించడంపై సుప్రీంకోర్టు కూడా మొట్టికాయలు వేసిందని తెలిపారు.

అడవులను కూడా వీరి దోపిడీకి వేదికలుగా చేసుకున్నారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఎర్రచందనం అక్రమ రవాణా, అటవీభూముల్లో ఖనిజాల తవ్వకం, అటవీ భూముల ఆక్రమణ, ఇళ్ల నిర్మాణం కోసం మడ అడవుల ధ్వంసం వంటి అక్రమాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయని చంద్రబాబు వివరించారు.

"ఇసుక తవ్వకాల్లో ప్రైవేట్ ఏజెన్సీలను తీసుకువచ్చారు. ఇసుక తవ్వకాల్లో అక్రమంగా భారీ యంత్రాలను ఉపయోగించారు. ఇసుక తవ్వకాల

వివరాలు 2లో..

# మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు



ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని కోర్టు పొడిగించింది. ఆయన కస్టడీని వారం రోజుల పాటు పొడిగించింది. మద్యం పాలసీ కేసులో మనీశ్ సిసోడియా తీహార్ జైల్లో ఉన్నారు. ఆయన జ్యుడీషియల్ కస్టడీని జులై 22 వరకు రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది.

# కోడికత్తి శ్రీను బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరణ



- 2019లో జగన్ పై కోడికత్తితో దాడి
- నిందితుడు శ్రీనివాసరావుకు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- బెయిల్ ను రద్దు చేయాలంటూ సుప్రీంను ఆశ్రయించిన ఎన్ఐఏ

వివరాలు 2లో..

# పవన్ కల్యాణ్ టీమ్ అంటే అందరూ గొప్పగా చెప్పుకునేలా ఉండాలి

### మంగళగిరిలో జనసేన ప్రజాప్రతినిధులకు సన్మానం

### హాజరైన నాదెండ్ల మనోహర్

### కూటమి ప్రభుత్వంలో ఉన్నాం కాబట్టి మిత్రపక్షాలను కలుపుకుని వెళ్లాలని పిలుపు



**పెన్ పవర్ డెస్క్:** జనసేన పార్టీ తరపున ఎన్నికల్లో గెలిచిన ప్రజా ప్రతినిధులను నేడు మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో అధినేత పవన్ కల్యాణ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... ప్రస్తుతం తాము

వివరాలు 2లో..

# ముచ్చుమర్రి, విజయనగరం ఘటనలు అత్యంత దారుణం

- రాష్ట్రంలో శాంతిభద్రతలు, గంజాయిపై సీఎం సమీక్షించారన్న అనిత
- ముచ్చుమర్రిలో బాలికను హత్య చేసి రిజర్వాయర్ లో పడేశారని వెల్లడి
- బాలిక కుటుంబానికి రూ.10 లక్షల సాయం అందిస్తున్నామని ప్రకటన



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో శాంతిభద్రతలు, గంజాయి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహిం చారని హెూం మంత్రి అనిత వెల్లడించారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రి, విజయనగరం ఘటనలు అత్యంత దారుణం అని వ్యాఖ్యానించారు.

వివరాలు 2లో..




# సంపాదకీయం

## వర్షాకాలం.. వ్యాధుల కాలం.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే...

వర్షాకాలం అంటే చల్లగా హాయిగా ఉంటుందని భావిస్తాం కానీ ఇది వ్యాధులు ముసురుకునే కాలం. అంతేగాదు మిగతా కాలాలతో పోలిస్తే వర్షాకాలంలో వైరస్‌లు, బ్యాక్టీరియా, ఇతర ఇన్‌ఫెక్షన్‌లకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీంతో జలుబు, దగ్గు, గొంతులో కఫం, వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల బారిన పడతారు... అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్? వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చంటున్నారు వైద్య నిపుణలు.. ఇప్పుడు ఆ వివరాలు గురించి తెలుసుకుందాం. . .

వర్షాకాలం వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తుంటాయి. జాగ్రత్తలు పాటించకపోతే పరిస్థితి తీవ్రంగా మారుతుంది. అందుకే రుతుపవనాలు మారిన వెంటనే కొన్ని విషయాలపై జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. వర్షాకాలం అంటేనే.. సీజనల్ వ్యాధుల కాలం. వేసవి తర్వాత వాతావరణంలో జరిగే మార్పులు, ఎడతెరపి లేని వర్షాలు, వాటివల్ల నిల్వ ఉండే నీటిలో దోమలు ఆవాసాలను ఏర్పరచుకోవడం, రోడ్లపై మురిగిన నీరు ఉండటం.. ఇలా రకరకాల కారణాల వల్ల సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ముఖ్యంగా చిన్నారులు వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. కనుక వర్షాకాలంలో తల్లిదండ్రులు ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి.

**ఆ జాగ్రత్తలు తప్పనిసరి**

వర్షాల వల్ల కలుషిత నీటికుంటలో, కాలువల్లో, ఇంటి పరిసరాల్లో నీరు చేరడం వల్ల నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన ప్రకారం 80 శాతం వ్యాధులు నీటి ద్వారానే వ్యాపిస్తాయి. ఇలా నీటి ద్వారా వ్యాపించే వ్యాధులకు వాటర్ బర్న్ వ్యాధులు అంటారు. నిల్వ ఉన్న నీరు దోమలకు, బ్యాక్టీరియాలు, శిలీంధ్రాలకు సంతానోత్పత్తి ప్రదేశం తయారవుతుంది. ఇవి వేగంగా పెరిగి వ్యాధులకు కారణమవుతాయి. వర్షాకాలంలో కలరా, టైఫాయిడ్ వంటి అనేక వ్యాధుల వ్యాప్తి పెరుగుతుంది. అంతేకాకుండాఈ సీజన్‌లో స్కిన్ ఇన్‌ఫెక్షన్లు కూడా చాలా వరకు పెరుగుతాయి.

**తేమ కారణంగా**

వర్షాకాలంలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల వైరస్ ,బ్యాక్టీరియాలు పెరుగుతాయి. దీంతో వైరల్ ఫీవర్, బ్యాక్టీరియా వల్ల ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. ఈ సమయంలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో దోమలు కుట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా టైపాయిడ్ తో పాటు గాలి ద్వారా వ్యాపించే జబ్బులు జలుబు, గొంతునొప్పి వంటివి వస్తాయి. దీనికి తోడు దోమల బెడద కూడా ఎక్కువ అవ్వడంతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు అవకాశాలు ఎక్కువ. ఈ కాలంలో చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్దలు వరకు అందరూ ఆయా వ్యాధుల బారిని పడుతుంటారు. అలాంటి సమయంలో మన ఇంట్లో ఉండే వాటితోనే చక్కటి ఔషధాలు తయారు చేసుకుని సులభంగా ఆయా వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చు అంటున్నారు

**వార్ బర్న్ వ్యాధులు నివారించడానికి మార్గాలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

వర్షాకాలంలో బ్యాక్టీరియాలు, వైరస్‌లు మనుషుల మీద ప్రభావం చూపిస్తాయి. కాబట్టి ఎప్పుడు కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిది. గోరువెచ్చని నీరు తాగాలి.

ఫిల్టర్, వాటర్ ప్యూరిఫైయర్ నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి. బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా నీళ్ల బాటిళ్లు తీసుకెళ్లడం మంచిది. రోడ్డు పక్కన లేదా ఎక్కడపడితే అక్కడ ఉన్న నీటిని తాగకండి.

వర్షాకాలంలో ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుంది. అందుకే వీలైనంతవరకు స్ట్రీట్ ఫుడ్ తినడం మానుకోండి. పానీపూరీలు, మసాలా పూరీలు, పావుబాజీ వంటి స్ట్రీట్ ఫుడ్ తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

తినడానికి ముందు చేతులు కడుక్కోవాలి.ఏదైనా తినడానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవాలి.ఈ చిన్న అలవాటు మిమ్మల్ని ప్రమాదకర బ్యాక్టీరియా, వైరస్ నుంచి కాపాడుతుంది. పండ్లు, కూరగాయలను ఈ సీజన్‌లో తప్పకుండా కడగాలి. బండి మీద వర్షపునీటి కారణంగా బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఇంటికి వచ్చిన వెంటనే మంచి నీటితో శుభ్రంగా కడగడం గుర్తుంచుకోవాలి.

దోమలు లేకుండా ఉండేలా చేసుకోండి. దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వస్తాయి. దోమలు కుట్టకుండా ఉండాలంటే దోమతెరలు వాడటం మంచిది. నిద్రపోయేటప్పుడు ఫుల్ స్లీవ్స్ ధరించండి.

బయట వాతావరణం చల్లగా ఉంటుంది కాబట్టి శరీరం వెచ్చగా ఉండేలా మంచి దుస్తులు ధరించండి

పోషకాహారం ఆహారం తినడం మంచిది. విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉండే ఆహారాలు ఎక్కువగా తినాలి. ఇవి వ్యాధులు రాకుండా నివారిస్తాయి. అంతే కాకుండా చుట్టూ ఉండే పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం మంచిది.

ఇల్లు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకూదు.. ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే వాటిని తొలగించండి.

పచ్చికాయగూరలు తినొద్దు.. వర్షాకాలంలో ఆకుకూరలు అసలు తినకుండా ఉండటే మంచిది. ఈ జాగ్రత్తలు అన్ని తీసుకుంటూ మన ఇంట్లో ఉండే మసాల దినుసులతో ఈ కషాయాన్ని తయారు చేసుకుని సేవిస్తే ఆయా వ్యాధుల బారిన పడుకుండా ఉండోచ్చని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు

**కషాయం తయారు చేసేందుకు కావలసినవి**

- ధనియాలు: రెండు స్పూన్లు
- లవంగాలు -4
- యాలుకలు-2
- దాల్చిన చెక్క-అంగుళం ముక్క
- మిరియాలు -8
- జీలకర్ర- అరస్పూన్
- అల్లం లేదా శొంఠి: అర అంగుళం ముక్క

తయారీ విధానం: పైన చెప్పిన వాటిని అన్నింటిని దంచుకుని పొడి చేసుకుని ఓ డబ్బాలో స్టోర్ చేసుకుండి. కాచిన నీటిలో ఈ పొడిని చిటికెడు వేసుకుని, ఉప్పు వేసుకుని తాగొచ్చు లేదా నిమ్మరసం కలుపుకుని పరగడపున తీసుకుంటుంటే వర్షాకాలంలో వచ్చే ఎలాంటి వ్యాధులు మీ దరిదాపుల్లోకి వచ్చే అవకాశం చాలా తక్కువ అని చెబుతున్నారు ఆయుర్వేద వైద్యులు

# బ్రహ్మంగారు కాలజ్ఞానం రాసిన ప్రాంతాన్ని కూడా వదల్లేదు

- మొదటి పేజీ తరువాయి

కోసం నదులు, కాలువల మీద కూడా రోడ్లు వేసే పరిస్థితికి వచ్చారు. అధికారులను డిప్యుటేషన్ పై తెచ్చుకుని మరీ అక్రమాలకు పాల్పడ్డారు. ఇసుక అక్రమాలను ప్రశ్నించిన వారిపై అట్రాసిటీ కేసులు పెట్టేందుకు కూడా వెనుకాడలేదు.

కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో భారీగా ఇసుక దందాలు నడిచాయి. వైసీపీ నేతలకు కప్పం కట్టలేక చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారు. సాధారణంగా అటవీ శాఖను, గనుల శాఖను ఒకే వ్యక్తి ఇవ్వరు... కానీ వైసీపీ హయాంలో ఈ రెండు శాఖలను ఒకే వ్యక్తికి అప్పగించారు. తూర్పు గోదావరి జిల్లాలో లేటరైట్ గనులను బలవంతంగా లాక్కున్నారు... ప్రకాశం జిల్లాలో 250 క్వారీలపై దాడులు చేశారు. చిత్తూరు జిల్లాలో టార్గెటెడ్ ఇన్ స్పెక్షన్ల పేరుతో వేధింపులకు పాల్పడ్డారు. ఆఖరికి ద్రవిడ యూనివర్సిటీలో సైతం అక్రమ మైనింగ్ జరిగిందంటే వీళ్ళు ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు. ఎర్రచందనాన్ని వీళ్లే స్మగ్లింగ్ చేసుకుని వేరే దేశాలకు, ముఖ్యంగా చైనాకు తీసుకెళ్లేవారు. స్మగ్లింగ్ అనేది చాలా ప్రమాదకరమైనది. స్మగ్లర్లను ఎంకరేజ్ చేయడం అనేది డేంజరస్ ట్రెండ్. ఇక, పుంగనూరు, కార్వేటినగరం ప్రాంతాల్లో 6.725 ఎకరాల అటవీభూముల్లో మైనింగ్ కు అనుమతులు ఇచ్చారు. పల్నాడు ఏరియాలో ఇష్టానుసారం అడవుల నరికివేతకు పాల్పడ్డారు. ఇలాంటివి ఒకట్రెండు కాదు చాలా ఉన్నాయి.

అదే సమయంలో కాకినాడ జిల్లాలో 58 ఎకరాల మేర మడ అడవులను ధ్వంసం చేశారు. దీనిపై న్యాయపోరాటం చేస్తే ఎన్జీటీ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.5 కోట్ల జరిమానా కూడా వేసింది" అని చంద్రబాబు వివరించారు.

# పవన్ కల్యాణ్ టీమ్ అంటే అందరూ గొప్పగా చెప్పుకునేలా ఉండాలి

- మొదటి పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వంలో ఉన్నందున మిత్రపక్షాలను కూడా కలుపుకుని వెళ్లాలని జనసేన ప్రజాప్రతినిధులకు సూచించారు.

"ఇది మన ప్రభుత్వం... జనసేన పార్టీకి, పవన్ కల్యాణ్ కు మంచి పేరు తెచ్చేలా పనిచేయాలి. పవన్ కల్యాణ్ టీమ్ అంటే అందరూ గొప్పగా చెప్పుకునేలా ఉండాలి. మనం ప్రజాప్రతినిధులుగా ఎన్నికవడంతో మనకు పదవులు వచ్చాయి... కానీ మన విజయం కోసం పాటుపడిన జనసైనికులు, వీరమహిళలను మనం మర్చిపోకూడదు. ప్రతి జనసైనికుడు, వీరమహిళ కూడా ప్రభుత్వంలో భాగస్వామ్యమే.

జనసేన పార్టీ ప్రజాప్రతినిధులు కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలపై విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలి... శ్వేతపత్రాలపై అవగాహన పెంచుకోవాలి. అన్నిటికంటే నిజాయతీగా పనిచేయడం ముఖ్యం" అని నాదెండ్ల మనోహర్ కర్తవ్య బోధ చేశారు.

# ముచ్చుమర్రి, విజయనగరం ఘటనలు అత్యంత దారుణం

- మొదటి పేజీ తరువాయి

ముచ్చుమర్రిలో బాలికను హత్య చేసి రిజర్వాయర్ లో పడేశారని వెల్లడించారు. ముచ్చుమర్రి ఘటనలో నిందితులు మైనర్లు అని స్పష్టం చేశారు. మద్యం, గంజాయి, మత్తులో ఈ ఘటనలు జరిగాయని వెల్లడించారు. ఈ ఘటనలను స్పెషల్ కోర్టు ద్వారా విచారించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. నేరస్తులకు పార్టీ, కులం ఉండదని, ఎవరైనా సరే శిక్షించాల్సిందేనని అనిత ఉద్ఘాటించారు.

ముచ్చుమర్రి ఘటనలో బాలిక కుటుంబానికి రూ.10 లక్షల సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. విజయనగరం ఘటనలో బాలిక పేరుతో రూ.5 లక్షలు ఫిక్స్ డ్ డిపాజిట్ చేస్తున్నామని చెప్పారు.

# కోడికత్తి శ్రీను బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరణ

**పెన్ పవర్ డెస్క్:** గతంలో విశాఖ ఎయిర్ పోర్టులో మాజీ ముఖ్యమంత్రి జగన్ పై కోడికత్తితో దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితుడిగా ఉన్న శ్రీనివాసరావుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి కూడా విదితమే. అయితే హైకోర్టు ఇచ్చిన బెయిల్ ను రద్దు చేయాలని కోరుతూ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ ఉత్తర్వులపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. బెయిల్ రద్దు చేయలేమని స్పష్టం చేసింది. 2019 ఎన్నికలకు ముందు జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఆయనపై కోడికత్తితో దాడి జరిగింది. ఈ దాడి అప్పట్లో రాజకీయ వర్గాల్లో పెను ప్రకంపనలు పుట్టించింది.

# మానవత్వం ఉన్న నాయకుడెవరూ వికృత చేష్టలకు పాల్పడడు: రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం

**'కాటమయ్య రక్షణ కవచం' కిట్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి**

**గౌడన్నల పట్ల సీఎం దుర్మార్గంగా ప్రవర్తించారని విమర్శ**

**మ్యాటర్ వీక్ ఉన్నప్పుడే ప్రచారం పీక్‌లో ఉంటుందని ఎద్దేవా**



మానవత్వం ఉన్న నాయకుడెవరూ వికృత చేష్టలకు పాల్పడడని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో 'కాటమయ్య రక్షణ కవచం' కిట్ల పంపిణీ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌడన్నల పట్ల ఆయన దుర్మార్గంగా ప్రవర్తించారని కేటీఆర్ మండిపడ్డారు. గంటల తరబడి గౌడన్నలను చెట్ల మీద ఉంచడం సరికాదన్నారు.

'మానవత్వం ఉన్న నాయకుడెవరూ ఇటువంటి వికృత చేష్టలకు పాల్పడడ'ని నిప్పులు చెరిగారు . గౌడన్నలను ఆ చెట్ల మీద అంతంతసేపు నిలబెట్టి, వారి వృత్తి మీద చౌకబారు జోకులు వేస్తూ, దాన్ని ప్రచారానికి వాడుకోవడం అమానవీయం, దుర్మార్గమన్నారు. మ్యాటర్ వీక్ ఉన్నప్పుడే.. ప్రచారం పీక్‌లో ఉంటుందని ఎద్దేవా చేశారు. మీ మతిలేని చర్యలు తెలంగాణ ప్రజలకు అర్థమవుతున్నాయని పేర్కొన్నారు.

# పంట రుణమాఫీపై మార్గదర్శకాలు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం... వీరికి వర్తించదు!

**ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని వెల్లడి**

**2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13వ వరకు తీసుకున్న రుణాలపై మాఫీ**

**రైతు కుటుంబం గుర్తింపుకు రేషన్ కార్డు ప్రామాణికమని వెల్లడి**




తెలంగాణ ప్రభుత్వం పంట రుణమాఫీ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని వెల్లడించింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13వ తేదీ వరకు తీసుకున్న పంట రుణాలపై ఇది వర్తిస్తుందని వెల్లడించింది. రైతు కుటుంబం గుర్తింపుకు రేషన్ కార్డు ప్రామాణికమని వెల్లడించింది.

పంట రుణమాఫీ కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేయనున్నారు. రుణమాఫీ నగదు నేరుగా లబ్ధిదారుల రుణఖాతాల్లోనే జమ కానుంది. ఆరోహణ క్రమంలో రుణమాఫీ సొమ్మును విడుదల చేస్తారు. ఎస్‌హెచ్‌జీ, జేఎల్జీ, ఆర్ఎంజీ, ఎల్ఈసీఎస్ రుణాలకు, రీషెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదు. రుణమాఫీపై రైతుల సందేహాలను తీర్చడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. రైతు సమస్యలు ఉంటే 30 రోజుల్లో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలకు వెబ్ పోర్టల్ చూడవచ్చు... లేదా మండల సహాయ కేంద్రాలను సంప్రదించాలి.అంతకుముందు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... అగస్ట్‌లోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక రైతుబంధు లేదా రైతు భరోసాకు సంబంధించి ఏడు వేల కోట్లకు పైగా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు.

# ఒమర్ అబ్దుల్లా భార్యకు సుప్రీంకోర్టు నోటీసులు

**డాకులు ఇప్పించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒమర్ పిటిషన్**

**నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలంటూ ఒమర్ భార్యకు నోటీసులు**

**ఒమర్ తరపున వాదనలు వినిపించిన కపిల్ సిబాల్**



జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా భార్య పాయల్ అబ్దుల్లాకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తన భార్యతో విడాకులు కోరుతూ సుప్రీంకోర్టులో ఒమర్ అబ్దుల్లా పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ ను విచారించిన జస్టిస్ సుధాన్షు ధూలియా, జస్టిస్ అసనుద్దీన్ లతో కూడిన ధర్మాసనం పాయల్ కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశాలు జారీ చేసింది. పాయల్ తన పట్ల క్రూరంగా వ్యవహరిస్తోందని... ఆమెతో తనకు విడాకులు ఇప్పించాలని 2016లో ఫ్యామిలీ కోర్టులో ఒమర్ పిటిషన్ వేశారు. అయితే, ఆయన విన్నపాన్ని ఫ్యామిలీ కోర్టు తిరస్కరించింది. దీంతో, ఆయన హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా ఫ్యామిలీ కోర్టు నిర్ణయాన్ని 2023లో సమర్థించింది. ఈ క్రమంలో ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఒమర్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపిస్తూ... వీరిద్దరూ 15 ఏళ్లుగా విడివిడిగానే ఉంటున్నారని... వారి దాంపత్య బంధం దాదాపు ముగిసినట్టేనని చెప్పారు. వీరికి విడాకులు మంజూరు చేయాలని కోరారు.

# ఏఐసీసీ సూచనల మేరకే చేరికలు జరుగుతున్నాయి: మధుయాష్కీ

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ స్పందించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో యాష్కీ మాట్లాడుతూ... ఏఐసీసీ సూచనల మేరకే చేరికలు జరుగుతున్నాయన్నారు. తాము డబ్బులు ఇచ్చి ఎవరినీ చేర్చుకోవడం లేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను బీజేపీలో చేర్చుకొని వారిని మంత్రులుగా కూడా చేశారని ఆరోపించారు. ప్రజాపాలనలో అందరికీ స్వేచ్ఛ ఉందని... ఎవరైనా ముఖ్యమంత్రి కావొచ్చునన్నారు. ముఖ్యమంత్రిని కలవడానికి ఎమ్మెల్యేలు వస్తున్నారని తెలిపారు.

# ఆ బిడ్డకు తండ్రి విజయసాయిరెడ్డి అని చెప్పేసరికి నా గుండె పగిలింది: మదన్ మోహన్

### చర్చనీయాంశంగా విజయసాయిరెడ్డి, శాంతి వ్యవహారం
### మీడియా ముందుకు వచ్చిన శాంతి భర్త మదన్
### ఏం జరిగిందో పూసగుచ్చినట్టు చెప్పిన మదన్



ఇప్పుడెక్కడ చూసినా విజయసాయిరెడ్డి, శాంతి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. శాంతికి ఎవరి వల్ల గర్భం వచ్చిందో నిగ్గు తేల్చాలంటూ ఆమె భర్త మదన్ మోహన్ తెరపైకి రావడంతో అందరి దృష్టి ఇటువైపు మళ్లింది. ఇప్పటికే శాంతి, విజయసాయిరెడ్డి మీడియా ముందుకు వచ్చి తమ గొంతుక వినిపించారు. తమకేమీ తెలియదని, మదన్ మోహన్ అసత్య ఆరోపణలు చేస్తున్నాడన్నది వారి వ్యాఖ్యల సారాంశం. ఈ నేపథ్యంలో, శాంతి భర్త మదన్ మోహన్ తాజాగా మీడియా ముందుకు వచ్చారు. తన నేపథ్య వివరాలను వెల్లడించారు. తనకు తండ్రి చిన్నప్పుడే చనిపోయారని, నాడు ఇందిరాగాంధీ ఇచ్చిన స్థలం మూడు సెంట్లు రోడ్డు పక్కనే ఉండడంతో దాని వల్ల కాస్త లాభపడ్డానని వివరించారు. తాను అమెరికాలో ఎంఎస్ చేశానని, పీహెచ్ డీ కూడా చేశానని... ప్రస్తుతం సనత్ లో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ లో అసిస్టెంట్ డైరెక్టర్ గా పదేళ్లుగా పనిచేస్తున్నానని వెల్లడించారు. "ప్రింటింగ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ చేశాను. అమెరికాలో ఉన్నత విద్య అనంతరం భారత్ తిరిగి వచ్చాను. బాల్యంలో నేను పడిన కష్టాలను బట్టి, భారతదేశంపై నాకున్న అపారమైన గౌరవాన్ని బట్టి నాకు భార్యగా ఒక లాయర్ వస్తే బాగుండని కోరుకున్నాను. లా చదివిన అమ్మాయే నాకు భార్యగా రావాలని కోరుకున్నాను. మా ఊరు కోవెలకుంట్ల. నంద్యాలలో ఉండే కాలింగిరి శాంతి సంబంధం కుదిరింది. ఈమె కూడా ఎస్టీ ఎరుకల. బంధువుల ద్వారా పరిచయం అయింది. మాది పెద్దలు కుదిర్చిన వివాహం. 2013 నవంబరు 9న మా పెళ్లి జరిగింది. మేం ఒకరికొకరు బాగా నచ్చాం. అప్పటికి ఆమె పడాల రామిరెడ్డి లా కాలేజిలో ఎల్ఎల్ బీ చదువుతోంది. దేవుడు నేను కోరుకున్న అమ్మాయిని ఇచ్చాడు... ఇద్దరం హైదరాబాద్ లో స్థిరపడ్డాం. ఆ తర్వాత కాలంలో నేను కూడా లా చదివాను. కాన్ స్టిట్యూషనల్ లా కోర్సులో నేను గోల్డ్ మెడలిస్టును. 2015లో మాకు ఇద్దరు కవల ఆడపిల్లలు పుట్టారు. నేను నయాపైసా కట్నం తీసుకోకుండా పెళ్లి చేసుకున్నాను. అమెరికాలో నేను సంపాదించిన రూ.10 లక్షలు భారత్ కు తీసుకువచ్చి అందులో రూ.5 లక్షలతో పెళ్లి చేసుకున్నాను. శాంతి న్యాయవాద వృత్తి స్వీకరించేలా ప్రోత్సహించాను. అంతా సవ్యంగానే సాగింది. 2017లో దమ్మాయిగూడలో ఒక డూప్లెక్స్ ఇల్లు తీసుకున్నాం. 2019లో ఆమెకు ఏపీ దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్ గా ఉద్యోగం వచ్చింది. శాంతి చిన్నతనంలోనే వారి కుటుంబాన్ని తండ్రి వదిలేశాడు. దాంతో శాంతి తల్లి ఓ బీసీ కులస్తుడ్ని రెండో పెళ్లి చేసుకుంది. రెండో భర్త ద్వారా శాంతి తల్లికి ఇద్దరు అమ్మాయిలు కలిగారు. ఇవన్నీ తెలిసి కూడా నేను శాంతిని పెళ్లి చేసుకున్నాను. ఇద్దరం చాలా ప్రేమగా ఉండేవాళ్లం. 2020లో శాంతికి విశాఖలో మొదటి పోస్టింగ్ ఇచ్చారు. నేను కాన్ స్టిట్యూషన్ లా కోర్సులో గోల్డ్ మెడలిస్ట్ ను. దాంతో పీహెచ్ డీ చేసేందుకు అమెరికా వెళ్లాలనుకున్నాను. అప్పటికి శాంతి ఉద్యోగంలో చేరింది కాబట్టి, నేను పీహెచ్ డీ చేసేందుకు ఇదే సరైన సమయం అనుకున్నాను. 2020 జనవరిలో అమెరికా వెళ్లాను. రెండు సార్లు స్వదేశానికి తిరిగొచ్చాను. అసలే నా భార్యకు ఆవేశం ఎక్కువ... ఇద్దరు పిల్లలను చూసుకోగలుగుతుందా, లేదా... అని పరిశీలించడానికి వచ్చాను. నేను భారత్ రాగానే కొవిడ్ ప్రారంభమైంది. దాంతో రెండేళ్లు ఇక్కడే ఉండిపోయాను. ఆ తర్వాత మళ్లీ అమెరికా నుంచి పిలుపొచ్చింది. పిల్లల కోసం ఇక్కడే ఉండిపోవాలనిపించింది. ఇద్దరం గ్రూప్-1 స్థాయి అధికారులమే కదా... ఇంకెందుకు అమెరికా వెళ్లడం అనుకున్నాను. అయితే, అమెరికా వెళ్లాలంటూ శాంతి ఒత్తిడి చేసింది. అప్పటికే శాంతి చాలా సెన్సేషనల్ అయింది. పుష్పవర్ధన్ అనే డీసీపై ఇసుక చల్లడం, గొడవలతో వార్తల్లోకెక్కింది. న్యాయం కోసం గొడవలు చేయడం తప్పుకాదు... తిక్క తిక్క గొడవలు చేయడం తప్పు. అప్పటికే ఆమె మాటలు సరిగ్గా ఉండేవి కావు. పెళ్లయినప్పటి నుంచి చెబుతుండేవాడ్ని... అలా మాట్లాడకూడదు అని. కానీ, ఏందిరా నీ నీతులు అన్నట్టు ఉండేది. ఆ తర్వాత నేను మళ్లీ అమెరికా వెళ్లాలనుకున్నాను. నా భార్య శాంతి కూడా అమెరికా వెళ్లు, వెళ్లు అంటూ గట్టిగా చెప్పింది. కానీ నా స్కాలర్షిప్ అప్లికేషన్ కాలపరిమితి పూర్తయిందని కేంద్ర ప్రభుత్వం చెప్పడంతో ఏంచేయాలా అని ఆలోచించాను. అప్పుడే నా భార్య విజయసాయిరెడ్డి గురించి చెప్పింది. ఓసారి హైదరాబాదు జూబ్లీహిల్స్ లో ఆయన ఇంటికి కూడా నన్ను తీసుకెళ్లింది. అప్పుడు విజయసాయిరెడ్డి గారి భార్య సునంద మేడమ్ కూడా ఇంట్లోనే ఉన్నారు. అప్పుడు మేం అందరం ఫొటోలు కూడా దిగాం. సార్ పక్కన నా భార్య శాంతి నిలబడితే నేనే ఫొటో తీశాను. ఆయన నా తండ్రి వయసు వాడు అని నమ్మాను. అప్పుడు నాకు ఎలాంటి అనుమానాలు లేవు.

నా అప్లికేషన్ గురించి శాంతి ద్వారా విజయసాయిరెడ్డి సార్ కి చెబితే... వెంటనే ఢిల్లీలో మూడు మంత్రిత్వ శాఖలను కదిపి, నా పని చేసిపెట్టారు. దాంతో నేను 2022 జనవరిలో మళ్లీ అమెరికా వెళ్లాను. ఆ తర్వాత సెప్టెంబరులో శాంతి ఫోన్ చేసి ఒక్క వారం వచ్చిపో అని కోరింది. అయితే నాకు రీసెర్చ్ పని ఉంది రాలేను అని చెప్పాను. విశాఖలో ప్రేమ సమాజం అనే సంస్థకు చెందిన భూముల విషయంలో సార్ కు ఫేవర్ గా చేశాను. ఆయన తన పరపతి ఉపయోగించి మనకు ఆర్థికంగా కొంచెం సాయం చేస్తున్నారు.. విజయవాడలో రూ.4 కోట్లు పెట్టి ఒక విల్లా కొందాం... అందుకే నిన్ను ఇండియా రమ్మన్నాను అని చెప్పింది. సార్ తన పరపతి ఉపయోగించి రెండున్నర కోట్లకే ఇప్పిస్తామన్నారని తెలిపింది. తక్కువ రేటుకే వస్తుండడంతో భారత్ వచ్చాను. సెప్టెంబరు 19న భారత్ వచ్చి 25 వరకు ఉన్నాను. విజయసాయి సార్ గైడెన్స్ తో ఓ బిల్డర్ నుంచి కోటి రూపాయలు తెచ్చాం. కోటి రూపాయలు వైట్ మనీ.... మిగతా కోటిన్నర బ్లాక్ మనీ. అయితే ఎందుకింత రిస్క్ అనుకున్నాను. ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లి విజయసాయి సార్ ఇంటికి వెళ్లమని శాంతి చెప్పడంతో వెళ్లాను. అప్పుడు విజయసాయి సార్ భార్య సునంద మేడమ్ ఉన్నారు. ఆమె ఓ బ్యాగ్ అక్కడ పెట్టారు. అందులో రూ.60 లక్షలు ఉంటాయని శాంతి చెప్పడంతో, ఓసారి బ్యాగ్ ఓపెన్ చేసి చూసుకున్నాను. ఆ తర్వాత రోడ్డు మార్గంలో వైజాగ్ వెళ్లాను. మనం కొన్ని విషయాల్లో సార్ కు సాయం చేశాం కాబట్టి, ఆయన మనకు ఇలా సాయం చేస్తున్నాడని నా భార్య చెప్పడంతో నేను నమ్మాను.

నేను అమెరికా నుంచి వస్తుండడంతో... విజయసాయిరెడ్డి సార్ కోసం పెర్ఫ్యూమ్ లు తీసుకురావాలని శాంతి చెప్పింది. ఆమె చెప్పినట్టే తెచ్చాను. నేను అమెరికా నుంచి చాలారోజుల తర్వాత భారత్ వచ్చాను కాబట్టి... నా భార్యతో శారీరకంగా కలిశాను. అయితే ఆమె గర్భం దాల్చే విధంగా మా కలయిక జరగలేదు. నేను ఇంకా మూడేళ్లు అమెరికాలో ఉండాల్సి రావడంతో మళ్లీ పిల్లలు కనకూడదని నిర్ణయం తీసుకున్నాను. దాంతో, శృంగారం పూర్తి కాకముందే పడక మీది నుంచి లేచాను.

కానీ ఆ తర్వాత శాంతి తాను గర్భం దాల్చిన విషయం చెప్పడంతో నాకు ఆశ్చర్యం వేసింది. పిల్లలు వద్దు అనుకుని మనం జాగ్రత్త పడ్డాం కదా... ఇది ఎలా సాధ్యమైంది అని అడిగాను. దాంతో... ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. నువ్వొక భర్తవి అయి ఉండి ఇలా అడుగుతావా అని మండిపడింది. నువ్వింత అనుమాన పక్షివా అని ప్రశ్నించింది. అది కాదు శాంతీ... నేను శృంగారం పూర్తిగా చేయలేదు కదా... ఇది ఎలా సాధ్యమైంది? అని అడిగాను. మరోసారి అలా అడిగితే చెప్పుతో కొడతా అని చెప్పింది. దాంతో నేను గూగుల్ లో వెదికితే... ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, కొన్ని డ్రాప్స్ వల్ల కూడా గర్భం వచ్చే అవకాశం ఉందని అందులో ఉంది. దాంతో నాకు నేను సర్దిచెప్పుకున్నాను.

కానీ 2024లో నాకు తెలిసిన విషయం ఏంటంటే... సభ్య సమాజం సిగ్గుపడేలా... నాతో పడుకునే సరికే ఆమె ఎనిమిది వారాల గర్భంతో ఉంది. ఆమెకు 2023 ఏప్రిల్ 15న డెలివరీ అయింది. నేను వచ్చింది 2022 సెప్టెంబరు 19... ఆమెకు డెలివరీ అయింది ఏప్రిల్ 15. కనీసం ఏడు నెలలు కూడా పూర్తి కాలేదు. నేనెంత పిచ్చివాడ్ని అంటే... ఆ సమయంలో నేను అది కూడా కౌంట్ చేసుకోలేదు. నాకు పుట్టిన బిడ్డే అని నమ్మేశాను. అబ్బాయి పుట్టాడు కదా... భారత్ వస్తానంటే శాంతి వద్దు అని చెప్పింది. నేను భారత్ వచ్చాక బిడ్డను చూద్దామంటే... శాంతి నన్ను కలిసేందుకు ఇష్టపడలేదు. నీకు గర్భం ఎలా వచ్చిందని నన్ను అడగరాని ప్రశ్న అడిగావు... ఇక నీతో కలిసి ఉండడం నాకు ఇష్టం లేదు అని చెప్పింది. అప్పటికి శాంతికి పుట్టిన బిడ్డ నా బిడ్డే అనుకుంటున్నాను. ఆ తర్వాత శాంతి స్వయంగా అమెరికాలో ఉన్న నా ఫ్రెండ్ కి, హైదరాబాద్ లో ఉన్న నా బ్రదర్ కి ఫోన్ చేసి... ఈ బిడ్డ మదన్ కు పుట్టిన బిడ్డ కాదు... నేను ఐవీఎఫ్ పద్ధతిలో ఈ బిడ్డను కన్నాను అని చెప్పింది. దాంతో, నేను శాంతికి ఫోన్ చేసి ఎందుకు ఐవీఎఫ్ చేయించుకున్నావు... నేనేమీ నపుంసకుడ్ని కాదు కదా అని ప్రశ్నించాను. నేను భారత్ వచ్చేసరికి ఐవీఎఫ్ సర్టిఫికెట్ రెడీ చేయ్ అని స్పష్టం చేశాను.

ఆ తర్వాత ఇండియా వచ్చాను. శాంతి ఐవీఎఫ్ డాక్యుమెంట్ చూపించలేదు. ఏ ఆసుపత్రిలో చేయించుకుందో కూడా చూపించలేదు. గట్టిగా నిలదీసేసరికి హై ప్రొఫైల్ వ్యక్తులతో ఐవీఎఫ్ చేయించుకున్నాను అని చెప్పింది. ఇంకా గట్టిగా నిలదీసేసరికి శాంతి నాకు ఏం చెప్పిందంటే... విజయసాయిరెడ్డి గారికి పిల్లలు లేరు... ఆయనకు ఒక కూతురు ఉన్నా ఆమె దత్త కూతురు... ఆయనకు పిల్లలంటే ఇష్టం.. నేనంటే విజయసాయిరెడ్డి గారికి ఇష్టం... అందుకే ఆయనకు ఒక బాబు కావాలంటే కని పెట్టాను... అని చెప్పింది.

ఆ మాటతో నాకు గుండెలు పగిలిపోయాయి. ఆయన అడగడం ఏంటి... నువ్వు కని పెట్టడం ఏంటి అని ప్రశ్నించాను. విజయసాయిరెడ్డితో శారీరక సంబంధం అనుకో అని తనే చెప్పింది. ఇప్పుడు నేను వెళ్లి విజయసాయిరెడ్డి గారిని ఆ విషయం అడగ్గలనా? ఆ తర్వాత నా పెద్ద కూతురిని హత్తుకుని ఏడ్చాను.

పుట్టిన బిడ్డకు తండ్రెవరో తెలియదు... అడిగితే ఐవీఎఫ్ అంటుంది... గట్టిగా అడిగితే విజయసాయిరెడ్డి పేరు చెబుతుంది... ఆధారాలు చూపించమంటే ఆయన పెద్దాయన... ఎలా బయటికి వస్తారు? ఐవీఎఫ్ డోనర్లుగా వేరే వాళ్ల పేరు ఉంటుంది అని చెప్పింది. ఇప్పుడు నేను ఈ ఆధారాలన్నీ సిద్ధం చేసుకునే సరికి ఈ ఆర్నెల్లు సమయం పట్టింది. ఇక నిన్ను ఏలుకోను అని చెప్పాను. దాంతో శాంతి.. ఈ బిడ్డ నీ బిడ్డ కాదని తెలుసు కదా... విజయసాయిరెడ్డితో బేబీని కన్నాను... నువ్వే నా లైఫ్ లోంచి వెళ్లిపో అని నాతో అన్నది. ఇప్పుడు నేను ఎక్కడికి వెళ్లాలి?" అంటూ మదన్ మోహన్ కన్నీటి పర్యంతమయ్యారు.

ఇక, ఆసుపత్రిలో శాంతి దరఖాస్తులో సుభాష్ అనే వ్యక్తి సంతకం పెట్టాడని మదన్ వెల్లడించారు. "నేను నిలదీసేసరికి, సుభాష్ తన ఫ్రెండ్ అని చెప్పింది. ఫ్రెండ్ అయితే హజ్బెండ్ గా సంతకం ఎలా పెడతాడని ప్రశ్నించాను. ఇదే విషయాన్ని నేను సుభాష్ ను కూడా అడిగాను. సుభాష్ గారూ... ఈ విషయంలో మీ పేరు, మరో పెద్దాయన పేరు వినిపిస్తోంది... మీరెలా సంతకం పెట్టారు అని అడిగాను. ఆ బిడ్డకు నాకు ఎలాంటి సంబంధంలేదు... అవసరమైతే డీఎన్ఏ టెస్టుకైనా సిద్ధం అని సుభాష్ అన్నాడు. ఆ బిడ్డకు తండ్రెవరో తెలిసేదాకా నేను ఆమరణ దీక్ష చేస్తాను. పోతిరెడ్డి సుభాష్ డీఎన్ఏ టెస్టుకు రావాల్సిందే, విజయసాయిరెడ్డి కూడా డీఎన్ఏ టెస్టుకు రావాల్సిందే. అక్కడున్నది ఎంత పెద్ద వాళ్లయినా వదలను... ఇది నా జీవితానికి సంబంధించిన విషయం" అని మదన్ మోహన్ స్పష్టం చేశారు.

# ట్రంప్ పై దాడికి సంబంధించి ఆసక్తికర వీడియో పంచుకున్న రామ్ గోపాల్ వర్మ

### అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న ట్రంప్
### పెన్సిల్వేనియాలో ట్రంపై హత్యాయత్నం
### దుండగుడ్ని కాల్చి చంపిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు



ఎన్నికల ప్రచారం చేస్తున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై హత్యాయత్నం జరగడం తెలిసిందే. ట్రంప్ తలను తాకాల్సిన బుల్లెట్ చెవిని తాకుతూ వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. నిందితుడు థామస్ క్రూక్స్ ను సీక్రెట్ సర్వీస్ ఘటన జరిగిన వెంటనే మట్టుబెట్టారు. అయితే, ట్రంప్ పై కాల్పులు జరిపిన వ్యక్తి గురించి కొందరు ప్రత్యక్ష సాక్షులు ముందే పోలీసులను అప్రమత్తం చేసినా, పోలీసులు సరిగా స్పందించలేదని తెలుస్తోంది. దీనికి సంబంధించి ఒక ఆసక్తికర వీడియోను ప్రముఖ సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఓవైపు ట్రంప్ మీటింగ్ జరుగుతుండగా... ఆగంతుకుడు ఓ బిల్డింగ్ పైన దాడికి సిద్ధమవుతున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. ఆ ఆగంతుకుడ్ని సభకు వచ్చిన వారిలో కొందరు చూశారు. దీనిపై వర్మ స్పందిస్తూ... డొనాల్డ్ ట్రంప్ ను చంపడానికి వచ్చిన ఆ దుండగుడ్ని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు తప్ప ప్రతి ఒక్కరూ చూశారని ట్వీట్ చేశారు.

# బీఆర్ఎస్‌కు భారీ షాక్... కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఓ ఎంపీ అభ్యర్థి

### సీఎంను కలిసిన పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
### జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి వినోద్ కుమార్ కూడా కాంగ్రెస్‌లో చేరిక
### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి




బీఆర్ఎస్‌కు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. మరో ఎమ్మెల్యే, ఒక ఎంపీ అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జహీరాబాద్ లోక్ సభ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన గాలి వినోద్ కుమార్‌లు సాయంత్రం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. వీరిద్దరు బీఆర్ఎస్ పార్టీకి కీలక నేతలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో వారు అధికార పార్టీలో చేరారు. సీఎం వారికి జెండాను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాటా శ్రీనివాస్ గౌడ్‌పై గూడెం మహిపాల్ రెడ్డి 7 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిచారు. అలాగే, గత లోక్ సభ ఎన్నికల్లో గాలి వినోద్ కుమార్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ కుమార్ షెట్కార్ సమీప బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌పై 46 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

# అఫిడవిట్ కోసం సమయం కోరిన ఏపీ... నీటి పంపకాలపై విచారణ వాయిదా

తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై కృష్ణా ట్రైబ్యునల్‌లో విచారణ జరిగింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో తాజా అఫిడవిట్ దాఖలు చేయడానికి ఏపీ ప్రభుత్వం సమయం కోరింది. ఏపీ అఫిడవిట్ దాఖలుకు ట్రైబ్యునల్ నాలుగు వారాల సమయం ఇచ్చింది. తదుపరి విచారణను ఆగస్ట్ 28, 29 తేదీలకు వాయిదా వేసింది.

# ఓ ప్రయాణికుడికి మెడికల్ ఎమర్జెన్సీ... ఢిల్లీ-న్యూయార్క్ విమానం లండన్ కు మళ్లింపు

### ఢిల్లీ నుంచి న్యూయార్క్ వెళుతున్న విమానం
### మార్గమధ్యంలో అస్వస్థతకు గురైన ప్రయాణికుడు
### లండన్ లో ఎమర్జెన్సీ ల్యాండింగ్



ఓ ప్రయాణికుడికి అత్యవసర వైద్య సాయం అందాల్సి ఉండడంతో... ఢిల్లీ నుంచి న్యూయార్క్ వెళుతున్న విమానాన్ని లండన్ కు మళ్లించారు. ఈ విమానాన్ని లండన్ లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. అమెరికన్ ఎయిర్ లైన్స్ కు చెందిన ఈ విమానం (ఫ్లయిట్ నెం.293) ఢిల్లీ నుంచి న్యూయార్క్ బయల్దేరింది. మార్గమధ్యంలో ఓ ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దాంతో ఆ విమానాన్ని లండన్ లో అత్యవసరంగా దించాలని నిర్ణయించారు. లండన్ కాలమానం ప్రకారం ఉదయం 7 గంటలకు ల్యాండైన విమానం... తిరిగి 9.30 గంటలకు న్యూయార్క్ బయల్దేరింది.

# కేదార్‌నాథ్ ఆలయంలో 228 కేజీల బంగారం కనిపించడం లేదు: జ్యోతిర్మఠ్ శంకరాచార్య సంచలన వ్యాఖ్యలు

ఉత్తరాఖండ్‌లోని శివుని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయంలో 228 కిలోల బంగారం కనిపించడం లేదంటూ జ్యోతిర్మఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సంచలన వ్యాఖ్యలు చేశారు. కేదార్‌నాథ్‌లో బంగారం కుంభకోణం జరిగిందని, ఆ విషయాన్ని ఎందుకు లేవనెత్తడం లేదని ఆయన ప్రశ్నించారు. "అక్కడ స్కామ్ చేసి ఢిల్లీలో కేదార్‌నాథ్‌ను నిర్మిస్తారా? అలా చేస్తే మరో కుంభకోణం జరుగుతుంది. కేదార్‌నాథ్ ఆలయంలో 228 కేజీల పసిడి లేదు. దర్యాప్తు కూడా మొదలుపెట్టలేదు. దీనికి బాధ్యులు ఎవరు? ఇప్పుడు ఢిల్లీలో కేదార్‌నాథ్ ఆలయాన్ని నిర్మిస్తామని చెబుతున్నారు. అలా జరగడానికి వీల్లేదు" అని అవిముక్తేశ్వరానంద అన్నారు. కాగా దేశ రాజధాని ఢిల్లీలో కేథార్‌నాథ్ ఆలయం నిర్మాణానికి జులై 10న శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి కూడా పాల్గొన్నారు. అయితే ఢిల్లీలో ఆలయ నిర్మాణం పట్ల నిరసన తెలుపుతూ అవిముక్తేశ్వరానంద ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో కేదార్‌నాథ్ ఆలయం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పలువురు పూజారులు నిరసనకు దిగారు.

**ఉద్ధవ్ ఠాక్రే మళ్లీ మహారాష్ట్ర సీఎం అవుతారు**

శివసేన (యుబీటీ) చీఫ్ ఉద్ధవ్ థాక్రేతో అవిముక్తేశ్వరానంద సోమవారం సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్ధవ్ ఠాక్రే వంచనకు గురైన వ్యక్తి అని, ఆయన మళ్లీ తప్పకుండా మహారాష్ట్ర ముఖ్యమంత్రి అవుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. తామంతా సనాతన ధర్మాన్ని అనుసరించేవాళ్లమని, పాపం, పుణ్యాలకు నిర్వచనం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ద్రోహం అతి పెద్ద పాపమని, ఉద్ధవ్ ఠాక్రే మోసపోయారని, ఆయనకు జరిగిన ద్రోహానికి తామంతా బాధపడ్డామని తెలిపారు. ఉద్ధవ్ ఠాక్రే మళ్లీ మహారాష్ట్ర సీఎం అయ్యే వరకు తమ బాధలు తీరబోవని అన్నారు. మోసం చేసే వ్యక్తి హిందువు కాలేడని అవిముక్తేశ్వరానంద వ్యాఖ్యానించారు.

# అప్పుడే రేవంత్ రెడ్డి నాలుక మడతేశాడు: రుణమాఫీ మార్గదర్శకాలపై నిరంజన్ రెడ్డి ఆగ్రహం

### ఇవి మార్గదర్శకాలు కాదు... మభ్యపెట్టే ప్రయత్నాలని విమర్శ
### రుణమాఫీ మార్గదర్శకాలు అభ్యంతరకరంగా ఉన్నాయన్న మాజీ మంత్రి
### పీఎం కిసాన్ డేటాను అనుసరించడమంటే లక్ష్యానికి గండి కొట్టడమేనని వ్యాఖ్య

తెలంగాణలో పంటల రుణమాఫీకి సంబంధించి రాష్ట్ర వ్యవసాయ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విడుదల చేసింది మార్గదర్శకాలు కాదని... మభ్యపెట్టేందుకు ప్రయత్నాలని విమర్శించారు. రుణమాఫీ మార్గదర్శకాలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉందని విమర్శించారు. రైతులకు సాయం అందించేందుకు కేసీఆర్ రైతుబంధును తీసుకువచ్చారన్నారు. ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం అసలు రైతులకు రుణాలే మాఫీ చేయనట్లుగా కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఎనిమిది నెలలవుతున్నా దానిని అమలు చేయలేదన్నారు. ఈరోజు కొంతమందికే పరిమితమయ్యేలా మార్గదర్శకాలు తీసుకువచ్చారని విమర్శించారు. ఈరోజుల్లో 5 ఎకరాల వ్యవసాయదారుడు, రూ.30 వేల వేతనం చేసే ఉద్యోగి కూడా ట్యాక్స్ పరిధిలోకి వస్తున్నారన్నారు. రేషన్ కార్డు, పీఎం డేటా వంటి తోకా తొండాలు పెట్టి కొందరినే రుణమాఫీకి పరిమితం చేశారన్నారు. రుణమాఫీ చేశామన్న ప్రచారం చేసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. రైతు బాగుండాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. అసలు రాష్ట్రంలో రూ.2 లక్షల రుణం పొందిన రైతులు ఎంతమంది ఉన్నారో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీఎం కిసాన్ డేటాను మార్గదర్శకంగా తీసుకుంటాని ఎన్నికల ప్రచారంలో చెప్పలేదన్నారు. అసలు దానికి సంబంధించిన షరతులే లోపభూయిష్టమన్నారు. రుణమాఫీకి పీఎం కిసాన్ డేటాను అనుసరించడమంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడం... రైతాంగాన్ని వంచించడమే అన్నారు. హామీలు అమలు చేయడానికి ఈ ఆంక్షలు ఏమిటన్నారు. నాడు పరుగెత్తి రుణాలు తీసుకోండని చెప్పిన కాంగ్రెస్ పార్టీ వెంటనే రుణమాఫీ చేయలేదని... పైగా ఇప్పుడు చావు కబురు చల్లగా చెప్పిందని విమర్శించారు. తెల్లరేషన్ కార్డు ప్రామాణికం కాదని ముఖ్యమంత్రి రేవంత్ ఇటీవలే ప్రకటించాడని... సరిగ్గా నాలుగు రోజులు తిరగకముందే నాలుక మడతేశాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టీ20ల్లో యశస్వి జైస్వాల్ సరికొత్త రికార్డు..

**1 బాల్ కు 13 రన్స్ రాబట్టిన యశస్వి**

**నో బాల్ కావడంతో వరుసగా రెండు సిక్సర్లు బాదిన వైనం**

**జింబాంబ్వేతో జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్ లో యశస్వి రికార్డు**



జింబాంబ్వే పర్యటనలో భారత కుర్రాళ్ల జట్టు అదిరే ప్రదర్శన చేసింది.. ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్ లో భారత బ్యాట్స్ మెన్ యశస్వి జైస్వాల్ సరికొత్త రికార్డును సృష్టించాడు. టీ20ల్లో ఒకే బంతికి 13 పరుగులు రాబట్టిన తొలి బ్యాట్స్ మెన్ గా రికార్డులకు ఎక్కాడు. జింబాంబ్వే బౌలర్ సికందర్ రాజా బౌలింగ్ లో నో బాల్, ఫ్రీ హిట్ బంతులను సిక్సర్లుగా మలచడంతో ఈ రికార్డు సాధ్యమైంది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సికందర్ రాజా వేసిన ఫుల్ టాస్ ను డీప్ స్క్వేర్ లెగ్ మీదుగా జైస్వాల్ స్టాండ్స్ లోకి పంపించాడు. సిక్సర్ గా సిగ్నల్ ఇస్తూనే అంపైర్ ఈ డెలివరీని నో బాల్ గా ప్రకటించాడు. దీంతో ఫ్రీ హిట్ రూపంలో జైస్వాల్ కు మరో అవకాశం వచ్చింది. దీంతో జైస్వాల్ మరోసారి బంతిని సిక్సర్ గా మలిచాడు. దీంతో రెండు సిక్సర్లకు 12 పరుగులు, నో బాల్ కు ఒక పరుగు.. మొత్తం 13 పరుగులు భారత జట్టు స్కోరు బోర్డుకు యాడ్ అయ్యాయి. టీ 20 మ్యాచ్ లలో ఈ ఘనతను ఇప్పటి వరకూ ఏ బ్యాట్స్ మెన్ కూడా సాధించలేదు.

# ఇన్‌స్టా రీల్ వివాదం.. యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, సురేష్ రైనాలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**'వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' ఆడడంతో ఒళ్లంతా ఓనమైందని అర్థం వచ్చేలా ఇన్‌స్టా రీల్ చేసిన మాజీలు**

**వికలాంగులను అవమానించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎన్‌సీపీఈడీపీ**



వికలాంగులను అవహేళన చేసేలా ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్ పోస్ట్ చేశారంటూ భారత మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, సురేశ్ రైనా, యువరాజ్ సింగ్, గురుకీరత్ మాన్‌లపై ఢిల్లీలోని అమర్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఇటీవల 'వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించింది. అయితే 15 రోజులపాటు కొనసాగిన ఈ టోర్నమెంట్‌లో తమ ఒళ్లంతా ఓనమైందని, ఒళ్లంతా ఒకటే నొప్పులు ఉన్నాయనే ఉద్దేశంతో కుంటుతూ, కాళ్లూ, చేతులు వంకర తిప్పుతూ, నడుము పట్టుకొని ఈ మాజీ ఆటగాళ్లు నడిచారు. ఈ దృశ్యాలను చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే దివ్యాంగులను ఎగతాళి చేశారంటూ నేషనల్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఫర్ డిసేబుల్డ్ పీపుల్ (%చీజూజుణూ%) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్మాన్ అలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ క్రికెటర్లతో పాటు నిబంధనలకు విరుద్ధంగా కంటెంట్‌ను పోస్ట్ చేసేందుకు అనుమతించారంటూ మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ సంధ్యా దేవనాథన్ పేరుని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. నలుగురు మాజీ క్రికెటర్లపై ఫిర్యాదు అందిందని, దీనిపై విచారణ చేస్తామని స్టేషన్ అధికారి వెల్లడించారు. ఈ వీడియో ఏమాత్రం బాలేదని, వికలాంగులకు పూర్తిగా అవమానించడమేనని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు.

**ఎవరి మనోభావాలను దెబ్బతీయాలనుకోలేదు: హర్భజన్**

ఈ వివాదంపై హర్భజన్ సింగ్ స్పందించాడు. ఇటీవల సోషల్ మీడియాలో తాము పోస్ట్ చేసిన వీడియో ద్వారా ఎవరి మనోభావాలను దెబ్బతీయాలనేది తమ ఉద్దేశ్యం కాదని, ఈ మేరకు ఫిర్యాదు చేస్తున్న వ్యక్తులను సందేహాలను నివృత్తి చేయగలుచుకున్నానని తెలిపాడు. ప్రతి వ్యక్తిని, సమాజాన్ని తాము గౌరవిస్తామని, 15 రోజుల పాటు నిరంతరాయంగా క్రికెట్ ఆడడం వల్ల శరీరాలు అలసిపోయానని ప్రతిబింబించడమే వీడియో ఉద్దేశమని చెప్పాడు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చాడు.

# పాక్ పర్యటనకు మీ ప్రభుత్వం అనుమతి నిరాకరించినట్టుగా రాసివ్వండి.. బీసీసీఐకి పీసీబీ డిమాండ్!




వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఆడేందుకు భారత్ జట్టు ఆతిథ్య దేశం పాకిస్థాన్‌కు వెళ్తుందా? లేదా? అనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. భారత ప్రభుత్వం అనుమతించబోదని, తటస్థ వేదికపై ఆడేందుకు అవకాశం కల్పించాలంటూ ఐసీసీ వద్ద బీసీసీఐ ప్రతిపాదించినట్టు కథనాలు వెలువడుతున్నాయి. ఈ పరిణామంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వర్గాలు ఆసక్తికరంగా స్పందించాయి. భద్రతా కారణాల దృష్ట్యా ఇక్కడికి (పాకిస్థాన్) భారత జట్టును పంపించకూడదనుకుంటే.. భారత ప్రభుత్వం అనుమతిని నిరాకరించినట్టుగా రాతపూర్వక రుజువును అందించాలని బీసీసీఐని పీసీబీ కోరుతోందని పాక్ క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఫిబ్రవరి-మార్చిలో టోర్నమెంట్ జరగాల్సి ఉన్నందున ఏ విషయం వీలైనంత త్వరగా తేల్చిచెప్పాలని కోరుతున్నట్టు పీసీబీ వర్గాలు వెల్లడించాయి. కాగా జులై 19న శ్రీలంక రాజధాని కొలంబో వేదికగా ఐసీసీ వార్షిక సమావేశం జరగనుంది. అయితే ఐసీసీ అజెండాలో 'హైబ్రిడ్ మోడల్'లో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై చర్చ అంశం లేకపోవడం గమనార్హం. తటస్థ వేదికగా యూఏఈలో ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ నిర్వహించడంపై ఎలాంటి చర్చ జరిగే అవకాశం లేదు. కాగా తటస్థ వేదికలపై ఆడితే ఆ మ్యాచ్‌ల నిర్వహణకు ఐసీసీ అదనపు నిధులు కేటాయించాల్సి ఉంటుంది. పాకిస్థాన్ వచ్చేందుకు భారత ప్రభుత్వం అనుమతి తిరస్కరిస్తే.. ఆ విషయాన్ని రాతపూర్వకంగా లేఖను ఐసీసీకి బీసీసీఐ తప్పనిసరిగా తెలియజేయాలని పీసీబీ కోరుతోందని, ఆర్గనైజింగ్ కమిటీ వ్యవహారాలపై అవగాహనతో ఉన్న ఓ వ్యక్తి ఈ విషయాన్ని చెప్పారని ఓ జాతీయ మీడియా సంస్థ కథనం పేర్కొంది. టోర్నీ ఆరంభానికి కనీసం 5-6 నెలల ముందు భారత జట్టు ప్రయాణానికి సంబంధించిన ప్రణాళికలను అందజేయాలని కోరుతోందని పేర్కొంది. పాకిస్థాన్‌లో క్రికెట్ ఆడటం కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ చెబుతోంది. గతేడాది పాకిస్థాన్ ఆతిథ్యం ఇచ్చిన 2023 వన్డే ఆసియా కప్ సమయంలో కూడా అక్కడికి వెళ్లేందుకు నిరాకరించింది. దీంతో 'హైబ్రిడ్ మోడల్'లో భారత మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించిన విషయం తెలిసిందే.

# మతులు చెడగొడుతున్న సుహానాఖాన్

షారూఖ్ ఖాన్ వారసురాలు సుహానా ఖాన్ కథానాయికగా వెండితెర వెలుగులకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఖాన్ వారసుడు ఆర్యన్ కి నటనపై అంతగా ఆసక్తి లేకపోయినా తండ్రి లెగసీని ముందుకు నడిపించే గట్స్ తనకు ఉన్నాయని సుహానా నిరూపించేందుకు సిద్ధంగా ఉంది. త్వరలోనే ది ఆర్చీస్ చిత్రంతో ఈ భామ వెండితెరకు పరిచయమవుతోంది. అదే క్రమంలో సుహానాలోని స్టార్ వైబ్స్ ఇంటర్నెట్ ని ఊపేస్తున్నాయి. నిరంతరం రకరకాల వెకేషన్స్ నుంచి సుహానా హాటెస్ట్ ఫోటోషూట్లను షేర్ చేస్తుండగా అవి అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి.తాజాగా సుహానా ఖాన్ చిక్ బీచ్ వెకేషన్ ఫోటోలను షేర్ చేయగా అవి వైరల్ అయ్యాయి. గోవా బీచ్ లో సూర్యాస్తమయాలు, రుచికరమైన ఆహారాన్ని తన గర్లీ బ్యాచ్‌తో ఆస్వాధిస్తున్న త్రోబాక్ వేకే ఫోటోలను సుహానా షేర్ చేసింది. ఇందులో సుహానా హాటెస్ట్ ట్యాంక్ టాప్ - జీన్స్‌లో వేడెక్కించే లుక్ తో ప్రత్యక్షమైంది. దీనిపై %దీఖీఖీ% అనన్య పాండే వెంటనే స్పందించింది. త్రోబ్యాక్ ఫోటోలే అయినా ఇవి ఫ్రెష్ గా రిలీజ్ కావడంతో యూత్ లో చర్చకు తావిస్తున్నాయి. సుహానా ఖాన్ తన గోవా ట్రిప్ నుండి ఇప్పటివరకూ చూడని ఫోటోలతో తన అభిమానులకు అనుచరులకు చికిత్స చేస్తోంది. సోషల్ మీడియాల్లో అద్భుతమైన లుక్‌లతో అప్పుడప్పుడు అభిమానులను ట్రీట్ ఇస్తున్న సుహానా ఈ కొత్త లుక్ తో మరోసారి చర్చల్లోకొచ్చింది. హానా గోవా వెకేషన్ ఫోటోలు చూశాక... పిక్చర్ పర్ఫెక్ట్ లుక్ తో సుహానా కవ్వించిందంటూ అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఫోటోపై అనన్య పాండే, మహీప్ కపూర్, నవ్య నవేలి నందా కూడా స్పందించారు. ఆమె కజిన్, అలియా చిబ్బా తన పోస్ట్‌కి రెండు హార్ట్ ఎమోజీలను జోడించారు.సుహానా నటించిన తొలి చిత్రం 'ది ఆర్చీస్' విడుదలకు సిద్ధమవుతోంది. జోయా అక్తర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ లో విడుదల కానుంది. ఈ చిత్రంతోనే అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నందా .. దివంగత శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్ ఆరంగేట్రం చేస్తున్నారు. తాజాగా మోషన్ పోస్టర్ ని లాంచ్ చేయగా అంతర్జాలంలో వైరల్ గా మారింది. జోయా అక్తర్ స్వయంగా 'ది ఆర్చీస్' నుండి నటీనటులు సుహానా ఖాన్, అగస్త్య నందా, ఖుషీ కపూర్ ల మోషన్ పోస్టర్‌లను ఆవిష్కరించారు.సుహానా పాత్ర వెరోనికా లాడ్జ్‌ని పరిచయం చేసింది. జోయా ఈ పోస్ట్‌కి అద్భుతమైన క్యాప్షన్ ఇచ్చింది. "అత్యంత క్లాస్సి గాళ్ .. ఈ ప్రపంచం వెరోనికా లాడ్జ్‌ని బాగా చూసుకుంటుంది"అని వ్యాఖ్యను జోడించింది జోయా.





సోనారికా భడోరియా యొక్క ఆహ్లాదకరమైన లుక్స్

# దక్షిణాదిన అత్యుత్తమ వసూళ్లలో నంబర్- 1 నాయిక ఎవరు?

దక్షిణ భారతదేశం లోని నాలుగు చలనచిత్ర పరిశ్రమలు తెలుగు- తమిళం- మలయాళం- కన్నడ బాక్సాఫీస్ లలో రికార్డుల ను తిరగరాసిన విజయవంతమైన స్టార్లు ఉన్నారు. నాటి తరం లో %చీ% రామారావు - రజనీకాంత్ -మోహన్లాల్ సహా నేటితరం లో ప్రభాస్- యష్ వరకు దక్షిణాది నుండి వచ్చిన స్టార్ హీరోలు తమ చిత్రాల తో బాలీవుడ్ బ్లాక్ బస్టర్ లను కూడా సవాలు చేసారు. గత కొన్ని సంవత్సరాలుగా అగ్ర కథానాయకుల సరసన నటించిన పలువురు కథానాయికలు కూడా తమదైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. జయలలిత -శ్రీదేవి వంటి తారల అడుగుజాడల్లో దక్షిణాది నుండి నేటితరం కథానాయికల్లో 50 కోట్లు పైగా గ్రాస్ వసూలు చేసే చిత్రాల లో నటిస్తున్నారు. దక్షిణాది నుంచి అత్యధిక వసూళ్లు రాబట్టిన మహిళా ప్రధాన చిత్రం ఏదీ అంటే కీర్తి సురేష్ నటించిన మహానటి రికార్డుల్లో ఇంకా ఉత్తమ స్థానం లో నిలిచి ఉంది. నాలుగు దక్షిణాది చిత్ర పరిశ్రమల నుంచి వచ్చిన సిసిమాల్లో అత్యుత్తమ నాయికా ప్రధాన చిత్రంగా 2018 తెలుగు బయోగ్రాఫికల్ డ్రామా మహానటి ఇప్పటికీ రికార్డుల్లో ఉంది. క్లాసిక్ దేస్ నటి సావిత్రి జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం లో కీర్తి సురేష్ ప్రధాన పాత్ర లో నటించింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా రూ.83 కోట్లకు పైగా వసూలు చేసి గత బాక్సాఫీస్ రికార్డుల ను బద్దలు కొట్టింది. అప్పటికే అగ్ర నాయికలుగా ఏలుతున్న నయనతార - సమంతా రూత్ ప్రభు- అనుష్క శెట్టి సాధించిన రికార్డులన్నిటినీ మహానటి బ్రేక్ చేసింది. అత్యధిక వసూళ్లు చేసిన నాయికా ప్రధాన చిత్రంతో దక్షిణాది చలనచిత్ర పరిశ్రమలో కీర్తి పేరు మార్మోగింది.అనుష్క శెట్టి 2009 చిత్రం అరుంధతి 70 కోట్ల రూపాయల ను వసూలు చేసి రికార్డును నెలకొల్పింది. అనుష్క నటించిన మరో సినిమా రుద్రమదేవి కూడా అదే స్థాయి లో వసూళ్లు చేసింది. ఈ జాబితా లో భాగమతి కూడా మరో బ్లాక్ బస్టర్. ఇది ప్రపంచవ్యాప్తంగా రూ. 67 కోట్లు వసూలు చేసింది. అయితే ఈ జాబితా లో నయనతార కాస్త వెనుకబడింది. 2018లో వచ్చిన కామెడీ థ్రిల్లర్ 'కొలమావు కోకిల' నయన్ కి అత్యధిక వసూళ్లు చేసిన చిత్రం. ఇది రూ.63 కోట్లకు పైగా వసూలు చేసింది. కీర్తి అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలు మహానటి కేవలం కమర్షియల్ గా మాత్రమే కాకుండా విమర్శకుల ప్రశంసలను దక్కించుకుంది. ఈ చిత్రం కీర్తికి ఉత్తమ నటిగా జాతీయ చలనచిత్ర అవార్డు ను సంపాదించిపెట్టింది.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com